క్లుప్తంగా

నేడు, రేపు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

గోల్కొండ: మహ్మదీ లైన్‌లోని ఒవైసీ కమ్యూనిటీ హాల్‌లో ఆధార్ కార్డు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని మజ్లిస్ సీనియర్ నాయకులు అలీమొద్దీన్ తెలిపారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ప్రత్యేక చొరవతో ఈ ఆధార్ కేంద్రం నేడు, రేపు పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ కార్డు నమోదు, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కేంద్రం పని చేస్తుందని ఆయన తెలిపారు.

బాలికల విద్యాభివృద్ధికి కృషి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతుందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని సరోజినీనాయుడు వనితా మహా విద్యాలయ బాలిక కళాశాల డైమండ్ జూబ్లీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ సొసైటీ యాజమాన్యం బాలికల అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నంద మాట్లాడుతూ.. బాలికల ఉన్నత విద్యలో దక్షిణ భారతదేశంలోనే వనితా కళాశాలకు మంచి పేరు ఉందని తెలిపారు. అనంతరం కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆదిత్యమార్గం, కార్యదర్శి వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ డి.శోభన పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి



జీహెచ్‌ఎంసీ ఈఈ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: ఆగాపురాలో స్కూళ్ల ముందు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ ఈఈ ప్రకాష్‌కు విజ్ఞప్తి చేశారు. అబిడ్స్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఈఈకి వినతి పత్రం అందజేశారు. ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆగాపురాలో స్కూళ్ల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఈ ప్రకాష్ సానుకూలంగా స్పందించారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గోల్కొండ: ప్రీమియా అకాడమీ కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. లంగర్‌హౌస్‌లోని ప్రీమియ అకాడమీలో ప్రీ ప్రైమరీ చిన్నారులు ఎంతో ప్రత్యేకంగా తయారై వచ్చి తమ పట్టాలను అందుకున్నారు. తాము ఈ ఉత్సాహాన్ని బిల్లీ వోంకా 2.0 పేరున నిర్వహిస్తున్నామని తమ పాఠశాల నేపథ్యం వినూత్నమైందని ప్రీమియా అకాడమీ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సింధూరిరెడ్డి అన్నారు. 2.0 కార్యక్రమం చోటాభీమా కాస్టర్ ఫర్ లయన్ కింగ్ సిండ్రెల్లాతో మరెన్నో ఆసక్తికరమైన క్యారెక్టర్లను మిళితం చేస్తుందన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపు



అబిడ్స్: పురానాపూల్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు ట్రాఫిక్ పోలీసు అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించారు. జంక్షన్ నలుమూలలా ఎన్నో సంవత్సరాలుగా ఉన్న అక్రమ దుకాణాలన్నింటినీ గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌కుమార్, గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ కోటేశ్వర్‌రావు జంక్షన్‌ను సందర్శించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పలు సూచనలు చేశారు.

గోల్కొండ ఆస్పత్రిలో సీపీఆర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ మజహర్ ఉల్లా

గోల్కొండ: అత్యవసర పరిస్థితుల్లో కార్డియో పల్మనరీ రీసక్సిటేషన్ (సీపీఆర్) ద్వారా వ్యక్తి ప్రాణాలను రక్షించగల్గుతామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో సీఎంఈ కార్యక్రమంలో భాగంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె పని చేయడం ఆగిపోయిన సందర్భాల్లో వెంటనే కార్డియో పల్మనరీ రీసక్సిటేషన్ ద్వారా గుండెపోటును నివారించగల్గుతామన్నారు. దీనివల్ల గుండె నరాలు గాలిని గుండెలోకి వెళ్లనిస్తాయన్నారు. అకస్మాత్తుగా గుండె జబ్బులకు గురైన వారు ప్రమాదంలో గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ ప్రాథమిక చికిత్సతో ప్రాణాలు రక్షించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

కార్వాన్ ఎమ్మెల్యే, గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కౌసర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ.. ఇటీవల వెలుగు చూస్తున్న ఎన్నో విషయాల ద్వారా తాను సీపీఆర్ గురించి తెలుసుకున్నానని, ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ప్రభుత్వం సీపీఆర్ శిక్షణ ఇచ్చిందని దీనివల్ల పోలీసులు ఎన్నో ప్రాణాలు రక్షించగలిగిందన్నారు. ముఖ్యంగా రోడ్ల మీద జరిగే ప్రమాద సంఘటనలలో సమీపంలో ఉండే పోలీసులు వెంటనే ప్రమాదస్థలానికి చేరుకునే అవకాశం ఉంటుందని, వారు ప్రమాదానికి గురైన వ్యక్తిని పరిశీలించి సీపీఆర్ ద్వారా వారి ప్రాణాలను రక్షించగల్గుతున్నారన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి తాను ఎన్నో చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవికుమార్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, రవూఫ్ ఉద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్, తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



నిర్మాణ పనులపై అధికారులతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి నిర్మాణ పనులు చేపడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని చంద్రనగర్, యాకుత్‌పురా రైల్వేస్టేషన్, జఫర్‌రోడ్డు,, రెయిన్‌బజార్, చున్నేకిబట్టి తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో పాటు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి పర్యటించారు. పలు బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. యాకుత్‌పురా, ఈస్ట్ చంద్రనగర్, మదినానగర్, ధోబీఘట్, నాగాబౌళి, భవానీనగర్, తలాబ్‌కట్టా ప్రాంతాలో నాలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తాగునీటి, డ్రైనేజీ నిర్మాణ, సీసీ రోడ్డు, కమ్యూనిటీ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ నాయకులు, జలమండలి, జీహెచ్‌ఎంసీ, జలమండలి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



వినోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆంజనేయ గౌడ్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఎల్బీస్టేడియంలోని సాట్స్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇద్దరు చైర్మన్లు సమావేశమై క్రీడలపై చర్చించారు. బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాకుండా సమాజంలోని అన్నివర్గాల వారు క్రీడలను ఆదరించడం, ప్రోత్సహించడంతో విద్యార్థులు, యువకులు క్రీడలపట్ల మరింత ఆసక్తి చూపుతారన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో క్రీడాకారుల సంక్షేమానికి, క్రీడా రంగాన్ని ఎంతో పటిష్టం చేసిందన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా సాట్స్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అనంతరం సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ మట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజానికి క్రీడలే ప్రధానమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించే విధంగా సాట్స్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఆదరణ



ప్రశాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: బీఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణ రాష్ట్ర తరహాలో దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆదరణ లభిస్తుందని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా, బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా ప్రశాంత్‌రెడ్డిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో కార్యకర్తలకు, నాయకులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని గగ్గోలు పెట్టినా తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ సదర్భంగా మమతా గుప్తా, సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఆజాం అలీ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి



ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్, కార్పొరేటర్ రాజ్‌మోహన్‌ను సన్మానిస్తున్న స్థానికులు


దూద్‌బౌలి: చార్మినార్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మజ్లిస్ పార్టీ నిరంతర కృషి చేస్తుందని చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. మంగళవారం పురానాపూల్ డివిజన్‌లోని మీర్ జా రోడ్డు నుంచి మల్లడికీ తాలీం వరకు ఆయన నూతన సీవరేజ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి పరచడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిధులతో పాటు ఎమ్మెల్యే నిధులతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడూ పాటుపడుతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి మజ్లిస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్, జలమండలి డీజీఎం అబ్దుల్ హకీం, మజ్లిస్ పార్టీ ఏరియా అధ్యక్షులు హఫీజ్ షఫి మోహీనుద్దీన్, హఫీజ్ అత్తర్ అలీ సిద్ధిఖీ, మహ్మద్ లుక్మాన్, బాకర్ అలీ ఖాన్, మహ్మద్ హనీఫ్, ముజ్జు పటేల్, అబ్దుల్లా అలీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఐకాన్ అవార్డుల ప్రదానం



నాంపల్లి: వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురు మహిళా మూర్తులకు ఉమెన్ ఐకాన్–2023 అవార్డులు ప్రదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో అవార్డుల ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా డీఆర్‌ఓ సూర్యలత హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీహబ్ మెంటర్ రుమనా సిన్హా సెహగల్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ షేక్ ఫర్వీన్, నటి జయలక్ష్మి, ప్రోగ్రామ్ కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, కో ఆర్డినేటర్ పి.వీరమణి పాల్గొన్నారు. కేశవ మెమోరియల్ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాళింది తొలి అవార్డును అందుకున్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



గోల్కొండ: విద్యార్థులకు తమ ఆరోగ్యంపై పరిపూర్ణ అవగాహన ఉండాలని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైఎస్ అనురాధ దేవి అన్నారు. మంగళవారం గోల్కొండ కుమ్మరివాడిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భారత్ హెల్త్ మేళా నిర్వహించారు. ఈ ర్యాలీని వైఎస్ అనురాధ ప్రారంభించారు. అనంతరం కార్వాన్ నియోజకవర్గం క్లస్టర్ వైద్యాధికారిణి డాక్టర్ అనురాధ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి ఒక్కరికీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు ఆరోగ్య సేవలకు నిలయాలు అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, సుబ్బారావు, హేమలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత కార్డును ప్రతి ఒక్కరూ పొందాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: పేద ప్రజల అభ్యున్నతికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత కార్డును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి సూచించారు. గౌలిపురా మార్కెట్‌లో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత కార్డు నమోదు కౌంటర్‌ను మంగళవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్తీల్లోని ప్రజలు ఆయూష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత కార్డులను పొందాలన్నారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్ వారం రోజుల పాటు కొనసాగుతుందని.. దీన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, ఇ.సుమన్ కుమార్, జి.ధీరజ్‌లాల్, ఎం.వెంకటేష్, జె.అశోక్, ఎ.మధుసూదన్ గిరి, డి.విక్కీ, శివ, శ్రీనివాస్, పి.రమేష్ పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్

గన్‌ఫౌండ్రీ: అంధ విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలని స్ఫూర్తి జ్యోతి వ్యవస్థాపక అధ్యక్షుడు వందనం రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అంధ విద్యార్థులకు విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు జీవనోపాధిని పెంపొందించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలీల ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆదినారాయణ, మాతృదేవోభవ అధ్యక్షులు కేబీ శ్రీధర్, కన్వీనర్ ఉదయ్‌లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ముందుకు సాగాలి

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ ఉన్నతంగా ఎదగాలంటే మంచి క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం నిజాం కళాశాల బాలికల వసతి గృహంలో తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగం నుంచి వ్యాపార వేత్తగా మారడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా సైబర్ మోసాలు ఏవిధంగా జరుగుతాయనే అంశాలపై సైబర్ క్రైమ్ ఎస్‌ఐ జి.మల్లేష్ విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమా నాయక్, వైస్ ప్రిన్సిపల్ ఉపేందర్‌రెడ్డి, రసాయన శాస్త్ర విభాగాధిపతి హేమశ్రీ, డాక్టర్ సాంబశివ పాల్గొన్నారు.

బ్యాంక్ ఆడిట్‌పై అవగాహన సదస్సు

గన్‌ఫౌండ్రీ: నేటి సమాజం మార్పులకు అనుగుణంగా చార్టెడ్ అకౌంట్స్ ఆధునికతను అందిపుచ్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. మంగళవారం అబిడ్స్‌లోని ది పార్క్ హోటల్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నగర శాఖ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆడిట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరశాఖ చైర్మన్ మైలవరపు సతీష్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ముప్పాల శ్రీధర్, సదరన్ రిజియన్ స్టూడెంట్ అసోసియేషన్ చైర్మన్ చంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న సీఏ ప్రతినిధులు

గ్రంథాలయం ఎదుట విద్యార్థుల నిరసన



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షా పత్రాలను లీక్ చేయడంపై విద్యార్థి లోకం తీవ్ర నిరసన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని నిరసన చేపట్టారు. టీఎస్‌పీఎస్సీని పునవ్యావస్థీకరించాలని, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న సభ్యులను తొలగించి, పరీక్షలను తిరిగి నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షలపై సమగ్ర విచారణ చేపట్టి మరలా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో పెట్టాలంటూ ఆందోళన

- స్పందించిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
- వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన అధికారులు



ఇంటర్ బోర్డు ఎదుట ఆందోళన చేస్తున్న యుగంధర్‌గౌడ్

నాంపల్లి: ఇంటర్మీడియట్ విద్యార్థుల హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో పెట్టాలంటూ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆందోళన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల ఆగడాలు ఎక్కువయ్యాయని, విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. స్పందించిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రదబాయి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అప్‌లోడ్ చేయించారు. గతంలో చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఎగ్జామినేషన్స్ పకడ్బందీగా నిర్వహించాలంటూ ఆమెకు రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లవెల్లి భరత్, గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర ఇన్‌చార్జి సంతోష్ రాథోడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్, దుప్పల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెనోవ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



తొలగించిన కణతితో వైద్య బృందం

గోల్కొండ: రెనోవా ఆస్పత్రి వారు ఓ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్ని లంగర్‌హౌస్‌లోని రెనోవా ఆస్పత్రి కన్సల్టెంట్ ఆంకో సర్జన్ డాక్టర్ సంజయ్ యాదగిరి సర్జరీ వివరాలను వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన నగరానికి చెందిన 64 సంవత్సరాల మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో రెనోవా ఆస్పత్రికి వచ్చింది. కాగా ఈ మహిళను గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మావతి పరీక్షలు నిర్వహించగా ఆ మహిళకు 20 ఏళ్ల క్రితమే గర్భాశయం తొలగించినట్లు తెలిసింది. తదనంతరం నిర్వహించిన పరీక్షలలో మహిళకు అండాశయం వద్ద భారీ కణతి ఏర్పడిందని పరీక్షల్లో తేలింది. ఇతర పరీక్షల అనంతరం వైద్యులు ఆ మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించాలని వైద్య బృందం నిర్ధారించింది. ఎంతో క్లిష్టమైన ఈ శస్త్ర చికిత్సను డాక్టర్ సంజయ్ నేతృత్వంలో డాక్టర్ పద్మావతి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ ప్రదీప్‌తో కూడిన వైద్య బృందం ఆ మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించారు. మహిళ అండాశయం వద్ద నుంచి తొలగించిన ఈ కణితి బరువు 5 కిలోలు ఉంటుందని ఆయన తెలిపారు. మంగళవారం సదరు మహిళను సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లింది.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. మంగళవారం అబిడ్స్‌లోని నందిని ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు వ్యక్తిత్వంతో పాటు క్రమశిక్షణను కలిగి ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి నర్సిములు, అధ్యక్షుడు ప్రహర్ష పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గోల్కొండ: తనకు పిల్లలు పుట్టరేమోనని ఓ మహిళ డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వంశీ ప్రసాద్, సంధ్యారాణి భార్యాభర్తలు. ఇద్దరు రాందేవ్‌గూడలో నివాసం ఉంటున్నారు. వంశీప్రసాద్ సన్‌సిటీలోని తపాలా కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉదోగిగా పనిచేస్తున్నాడు. గత సంవత్సరం నవంబర్‌లో గర్భవతిగా ఉన్న తన భార్యను వంశీప్రసాద్ ఓ ప్రైవేటు నర్సింగ్ హోంకు తీసుకెళ్లాడు. అయితే గర్భస్థ శిశువు మెదడు వృద్ధి కాలేదని, అబార్షన్ చేసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో సంధ్యారాణి అబార్షన్ చేయించుకుంది. అబార్షన్ తరువాత సంధ్యారాణి డిప్రెషన్‌లోకి పోయిది. మంగళవారం ఉదయం భర్త వెళ్లగానే ఇంట్లో ఒంటరిగా ఉన్న సంధ్యారాణి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇరుపొరుగు వారు ఇంట్లో అలజడి లేకపోవడంతో వంశీప్రసాద్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఇంటికొచ్చిన వంశీ ప్రసాద్ భార్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



భార్యను హత్య చేసిన వ్యక్తి రిమాండ్

బహదూర్‌పురా: భార్యను హత్య చేసిన వ్యక్తిని బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాలుగా పురానాపూల్, బహదూర్‌పురా చుట్టు పక్కల వైన్స్‌ల వద్ద తుల్జప్ప, అనిత దంపతులు సీసాలు పొగు చేసి విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరితో పాటు బలరాం కూడా పని చేసేవాడు. అనిత బలరాంతో సన్నిహితంగా ఉంటూ మద్యం సేవించేది. ఈ విషయమై తుల్జప్ప పలుమార్లు అనితను హెచ్చరిస్తూ బలరాంతో మాట్లావద్దని.. అతనితో తాగొద్దని హెచ్చరించాడు. అనితలో ఎలాంటి మార్పు రాలేదు. ఈనెల 11న మద్యం సేవించిన తుల్జప్ప, అనిత, బలరాంలు పురానాపూల్ మసీదు వద్ద గుడిసెలో నిద్రించారు. రాత్రి పూట తుల్జప్ప మద్యం సేవించేందుకు పార్థివాడకు వెళ్లి లిక్కర్ కొనుగోలు చేసి సగం తాగి తిరిగి వచ్చాడు. అప్పటికే బలరాం, అనిత ఒకే దగ్గర ఉండటంతో కోపోద్రేక్తుడయ్యాడు. కొద్దిసేపటికి బలరాం వెళ్లిపోయాడు. అనితను చూడగా వివస్త్రగా ఉండటంతో అక్కడే ఉన్న కర్రతో ఇష్టానుసారంగా కొట్టాడు. తెచ్చుకున్న చీప్ లిక్కర్‌ను అవయవాలపై పోసి అగ్గిపెట్టెతో కాల్చివేశాడు. దీంతో తీవ్ర గాయాలతో అనిత మృతి చెందింది. అనిత సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని తుల్జప్పను అరెస్ట్ చేశారు.

ఏఎస్సై సెక్యూరిటీ గార్డుపై దాడి

గోల్కొండ: గోల్కొండ నయాఖిలాలోని అతియాన్‌కా జాడ్ గేటు వద్ద ఏఎస్సై సెక్యూరిటీ గార్డుపై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జాము చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోల్కొండ నయాఖిలాలో గోల్ఫ్ కోర్సు అభివృద్ధికి కేంద్ర పురాతత్వ సర్వేక్షణశాఖ వారు కొంత భూమిని గోల్ఫ్ కోర్సు వారికి ఇచ్చారు. ఈ విషయంపై ఇరువురి మధ్య ఒప్పందం కూడా జరిగింది. కొన్ని రోజుల నుంచి అతియాన్‌కా జాడ్‌గేటు వద్ద కేంద్ర పురాతత్వ సర్వేక్షణశాఖ వారు తమ సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం తెల్లవారు జామున 4 గంటల ఓ తాగుబోతు వచ్చి సెక్యూరిటీ ధర్మేందర్‌పై కట్టెతో దాడి చేసి అనంతరం తన వద్ద ఉన్న చాకు తీసి ధర్మేందర్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో ధర్మేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684